క్లుప్తంగా



ఆపరేషన్ థియేటర్‌కు వెళ్లి.. పింఛన్ చేతికిచ్చి...

యడ్లపాడు: ఆపరేషన్ థియేటర్‌లో సర్జరీ చేయించుకున్న వృద్ధురాలి వద్దకు వెళ్లి వలంటీర్ వైఎస్సార్ పింఛన్ కానుకను అందజేసింది. మండలంలోని సొలస గ్రామంలోని రంగానాయకస్వామి ఆలయం వద్ద ఉండే పొలూరి లక్ష్మీకాంతమ్మకు ఇటీవల వెన్నునొప్పి అధికంగా ఉండటంతో ఆస్పత్రిలో వెళ్లింది. వైద్యులు ఆపరేషన్ తప్పనిసరి అని చెప్పడంతో వారం కిందట చేరింది. మూడు రోజుల కిందట ఆరోగ్యశ్రీ పథకం కింద అర్హత లభించడంతో ఆపరేషన్ చేశారు. అయితే ఒకటో తేదీన ఫించన్ అందించేందుకు గ్రామ వలంటీర్ గొట్టం జ్యోతి వృద్ధురాలు లక్ష్మీకాంతమ్మ ఇంటికి వెళ్లింది. విషయం తెలియగానే నేరుగా పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఆస్పత్రి వెళ్లి పెన్షన్ డబ్బులను అందజేసింది.

వృద్ధురాలికి పింఛను పంపిణీ

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు చింతల సుబ్బులు అనారోగ్యంతో గురైంది. దీంతో నరసరావుపేట ప్రవేటు వైద్యశాల్లో చికిత్స పొందుతోంది. విషయాన్ని తెలుసుకున్న గ్రామ వలంటీరు నాగవరపు వెంకటేశ్వర్లు వైద్యశాలకు వెళ్లి పింఛను నగదు అందజేశారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

నరసరావుపేట ఈస్ట్: స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 146వ జయంతి వేడుకలను బుధవారం సాయంత్రం శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, పింగళి వెంకయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. వెంకయ్య కుమార్తె సీతామహాలక్ష్మి మాచర్లలో నివాసం ఉండటం జిల్లాకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, రిటైర్డ్ ఆంధ్రోపన్యాసకులు డాక్టర్ మడకా సత్యనారాయణ, పద్యకవి ఈవూరి వెంకటరెడ్డి, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

యడ్లపాడు: మండలం పరిధిలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని ఎంపీడీవో వై హనుమారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ యడ్లపాడు మండలంలో మూడు గ్రామాల్లోని నాలుగు వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఈ ఏడాది జులై 31 నాటికి 18 నుంచి 35 మధ్య ఏళ్ల వయస్సు కలిగి ఉండాలన్నారు. స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. జులై 31 నుంచి దరఖాస్తులకు అవకాశం కల్పించామని, ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అభ్యర్థులు దరఖాస్తులు ఆగస్టు 5వ తేదీలోపు పంపించాలన్నారు. ఈనెల 8న వచ్చిన అర్జీలకు పరిశీలించిన ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన వారికి లెటర్ ద్వారా నియామక పత్రాన్ని పంపిస్తామని 11న విధుల్లోకి చేరాల్సి ఉంటుందన్నారు. ఖాళీల వివరాలు..జగ్గాపురం గ్రామంలో ఎస్సీ (జనరల్)-2, కొండవీడు బీసీ (జనరల్)-1, సందెపూడి బీసీ (జనరల్)-1 మరిన్ని వివరాలకు ఆయా గ్రామాల్లోని సచివాలయం నోటీసు బోర్డులను పరిశీలించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసరావుపేట: మండలంలోని రావిపాడు గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణ నిమిత్తం జోన్ -3 పరిధిలోని గ్రామాలైన రావిపాడు, పాలపాడు, ఇక్కుర్తి, పట్టణ పరిధిలోని రామిరెడ్డిపేట, స్టేషన్‌రోడ్డు, కలెక్టర్ ఆఫీస్ ప్రాంతాల్లో ఉదయం 9:00 గంటల నుంచి 11:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం వెల్లడించారు.

ఓటర్ జాబితా పరిశీలించాలి

చిలకలూరిపేట టౌన్: బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ తిరిగి ఓటర్ల జాబితాను పరిశీలించాలని ఎన్నికల ప్రత్యేక అధికారి జి.వసంతబాబు చెప్పారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. వారి నుంచి సూచనలు స్వీకరించారు. జీరో డోర్ నంబర్లు ఉన్న ఇళ్లను ప్రత్యేకంగా పరిశీలించి సరిచేయాలని, జంబ్లింగ్ డోర్ నంబర్లను సరిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి సుజాత, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐదులోగా దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: పట్టణంలో ఖాళీగా ఉన్న ఆరు వలంటీరు పోస్టుల భర్తీకి ఈనెల ఐదవతేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్ఎస్‌సీ, తత్సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణులై గత నెల 31 నాటికి 18ఎళ్ల నుంచి 35ఏళ్లలోపు వయస్సు గల అభ్యర్థులు అర్హులన్నారు. సచివాలయాల నోటీసు బోర్డుల్లో నోటిఫికేషన్ ఉంచటం జరిగిందన్నారు.

అందరికీ సంక్షేమం.. అదే జగనన్న లక్ష్యం

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- యడ్లపాడులో రెండోరోజు కొనసాగిన కార్యక్రమం
- చెరువు, ఎర్రచెరువు ప్రాంతాల్లో పార్టీ శ్రేణులతో పర్యటన



యడ్లపాడులో గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విడదల రజిని

యడ్లపాడు: పేదవారి సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజైన బుధవారం కొనసాగింది. కార్యక్రమానికి హాజరైన మంత్రి రజిని స్థానిక మసీదు బజారు నుంచి ఇంటింటి కార్యక్రమాన్ని ప్రారంభించి, చెరువు, ఎర్రచెరువు ప్రాంతాల్లో పర్యటించారు. మహిళలు తమ ఇంటి ఆడపడుచులా సాదరంగా ఆహ్వానించారు. తమఇళ్ల ముందుకు రాగానే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో తమ కుటుంబానికి చేకూరిన లబ్ధి వివరాలను మంత్రి రజినికి మహిళలు సంతోషంగా చెప్పుకున్నారు. ఒక్కొక్క కుటుంబానికి వివిధ పథకాల ద్వారా లక్షల లబ్ధి రావడంతో తమ ఆర్థిక సమస్యల్ని చక్క దిద్దుకుని మెల్లమెల్లగా పరిపుష్టిని సాధిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత నాలుగేళ్ల కాలంలో నవరత్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు వచ్చిన లబ్ధి వివరాలను మంత్రి రజిని కరపత్రాల్లో చదివి వినిపిస్తూ.. ఇంకా పథకాలు సక్రమంగా అందుతున్నాయా.. వలంటీర్లు ఇళ్లకు వచ్చి ప్రభుత్వ పథకాల వివరాలపై అవగాహన కల్పించి, అర్హులకు వచ్చేలా సహకరిస్తున్నారా అంటూ మహిళలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఇవిగాక గ్రామంలోని సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు గడపగడపకూ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కుల, మత, పార్టీ, వర్గ బేధాలు లేకుండా అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పారదర్శక పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా హైస్కూల్ బజారులోని బ్రహ్మంగారి గుడి వద్ద మహిళలు గుడి నిర్మాణ పనులకు సాయం అందించాలని కోరారు. అలాగే పలు వ్యక్తిగత సమస్యలను విన్నవించుకున్నారు. సత్వరమే స్పందించిన మంత్రి రజిని సంబంధిత అధికారులను పిలిపించి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆద్యంతం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా మంత్రి వెంట నడిచారు.

కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, వైస్‌చైర్మన్ ఎం.వీరారెడ్డి, ఎంపీపీ పిడతల ఝాన్సీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఘంటా శంకర్, జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు, సర్పంచ్ కారుచోల హేమ, ఎంపీటీసీ కీర్తి అరుణ్‌కుమార్, నాయకులు బచ్చా, షాజహాన్, బండ్ల రామ్‌కుమార్, కల్లూరి హరిబాబు, కర్నాట సుబ్బారావు, బొంత ప్రభుదాసు, యామర్తి కోటేశ్వరరావు, పి దయాసాగర్, వడ్డేపల్లి నరసింహారావు, ఆలోకం వెంకటలక్ష్మీనారాయణ, కెశ్యామ్యేల్‌పాల్, ఎ.శ్యామ్‌పాల్, వాసు, గౌస్‌సందాని, పందుల బుల్లిబ్బాయి, గౌరు రాజేష్, ఉదయ్‌కుమార్, తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో వై.హనుమారెడి, ఈవోపీఆర్డీ వరూధిని తదితరులు ఉన్నారు.

ఆంధ్రా స్కూల్ విద్యార్థినులకు పతకాలు



నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలలో ఆంధ్రా సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థినిలు పతకాలు సాధించినట్టు ప్రధానోపాధ్యాయిని ఎ.ఇందిరాదేవి బుధవారం తెలిపారు. కర్నూలులో జరిగిన పోటీలలో తమ విద్యార్థినులు కె.అక్షిత అండర్-12 విభాగం డబుల్ అండర్‌లో బంగారు పతకం, ఫ్రీ స్టైల్‌లో రజితం, స్పీడ్ బౌన్సింగ్‌లో కాంస్య పతకం సాధించిందని తెలిపారు. అలాగే ఎల్.మౌక్తిక సైక్లింగ్‌లో కాంస్యం, స్పీడ్ బౌన్సింగ్‌లో రజిత పతకం సాధించిందన్నారు. టీం ఈవెంట్ డబుల్ టచ్ విభాగంలో కె.అక్షిత, ఎల్.మౌక్తిక, యు.హర్షిణి బంగారు పతకం సాధించారని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా సాధించిన ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో తమ విద్యార్థులు కీలకపాత్ర పోషించారని వివరించారు. విద్యార్థులను కెబీఆర్ విద్యాసంస్థల కార్యదర్శి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, డైరెక్టర్ కంచర్ల నరేంద్ర, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు ఏరియా ప్రభుత్వాసుపత్రి ప్రారంభోత్సవం

- ప్రారంభించనున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- హాజరు కానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు

చిలకలూరిపేట: నూతనంగా నిర్మించిన 100 పడకల ఏరియా ప్రభుత్వాసుపత్రిని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నారు. మంత్రి విడదల రజిని కృషితో రూ. 18.57 కోట్లతో నూతన ఏరియా ఆస్పత్రి భవనాలు సర్వహంగులతో రూపుదిద్దుకున్నాయి. మరో రూ. 2 కోట్లతో ఆసుపత్రికి అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలు సమకూరాయి. తొలి నుంచి మంత్రి రజిని ఆసుపత్రి నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వాసుపత్రి వెనుక భాగంలో ఓగేరు వాగు ప్రవహిస్తున్న నేపథ్యంలో మంత్రి సూచనల మేరకు భవనాలను ఎక్కువ ఎత్తులో నిర్మించారు. దీనికి తోడు ఎలాంటి వరద ముప్పు లేకుండా ఆసుపత్రి చుట్టూ రిటైనింగ్‌వాల్, ఆసుపత్రి ప్రాంగణంలో అంతర్గత సీసీరోడ్ల నిర్మాణానికి రూ. 9.5 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ పనులకు కూడా మంత్రి విడదల రజిని గురువారం శంకుస్థాపన నిర్వహిస్తారు. ఇప్పటికే ఏరియా ఆసుపత్రిలో అవసరమైన 23 మంది వైద్యులు, 73 మంది వైద్య సిబ్బందిని ప్రభుత్వ కేటాయించింది. ఈ నేపథ్యంలో ఆసుపత్రి ప్రారంభం నుంచి రోగులకు 24 గంటలు వైద్యం అందుబాటులోకి వస్తుంది. మూడు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, ల్యాబ్ సౌకర్యం, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్ వంటి వైద్య సేవలు నిత్యం అందుబాటులో ఉంటాయి. ఆసుపత్రి నిర్మాణ పనులను మంత్రి రజిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వచ్చారు. ఆసుపత్రి ప్రారంభోత్సవంలో మంత్రి రజినితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. వీరితో పాటు వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర రెడ్డి, జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ఆసుపత్రి ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ నాయకులు విడదల గోపీనాథ్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు తోట బ్రహ్మస్వాములు, గుంజి వీరాంజనేయులు పరిశీలించారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నాదెండ్ల: ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ నిధులతో పాటూ తన స్వంత నిధులతో నిర్వహిస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదివే విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు సక్రమంగా ఉన్నపుడే మంచి వాతావరణంలో చక్కగా చదువుకోగలుగుతారన్నారు. ప్రభుత్వ నిధులతో పాటూ తన స్వంత నిధులను జోడించి ఎక్కడా రాజీ లేకుండా పనులు నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులు కూడా పాఠశాలకు మంచి పేరు వచ్చేలా విద్యాబోధనలో కృషి చేయాలన్నారు. అంకిత భావంతో పనిచేసినపుడే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు. ఆయనతో పాటు హెచ్ఎం సుందరరావు, యన్నం శివారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే వైఎస్సార్ సీపీ లక్ష్యం

- ఎంపీపీ పిడతల ఝాన్సీ
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ టీహెచ్ఆర్ కిట్ల పంపిణీ



యడ్లపాడులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఝాన్సీ

యడ్లపాడు: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తనవంతు కృషి చేస్తోందని ఎంపీపీ పిడతల ఝాన్సీ చెప్పారు. ఐసీడీఎస్ నాదెండ్ల ప్రాజెక్టు ఆధ్వర్యంలో యడ్లపాడు గ్రామంలోని పీఆర్ విజ్ఞాన కేంద్రంలో బుధవారం టేక్‌హోం రేషన్ (ఇంటి వద్దకే సరుకులు) కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 9 అంగన్‌వాడీ కేంద్రాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ, గ్రామసర్పంచ్ కారుచోల హేమ హాజరై మాట్లాడారు. గర్భిణులు రక్తహీనత, పౌష్టికాహారలోపం బారిన పడకుండా ఉండేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద వారికి బలవర్ధకమైన పోషకాహారం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఒక్కొక్క కిట్‌లో బియ్యం-3 కేజీలు, కందిపప్పు కేజీ, రాగిపిండి 2 కేజీలు, బెల్లం 250 గ్రాములు, చిక్కీలు 250 గ్రాములు, ఖర్జురాలు 250 గ్రాములు, వంటనూనే 500 గ్రాములు, పాలు 2.5 లీటర్లు ఇస్తున్నారని లబ్ధిదారులు వీటిని తప్పక సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ ఏసీడీపీవో నిర్మల అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు అందించే వివిధ రకాల సేవల గురించి వివరించారు. అనంతరం 20 మంది గర్భిణులు, బాలింతలకు టీహెచ్ఆర్ కిట్లను అతిథులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం జీవన్, సూపర్‌వైజర్లు ఎం జోజమ్మ, శివపార్వతి, వెంకటరమణ, ఆయా అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు. లింగరావుపాలెం గ్రామంలోనూ టేక్ హోం రేషన్ కార్యక్రమాన్ని సర్పంచ్ కరీమూన్ ప్రారంభించి 20 మందికి కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఆలోకం వెంకటలక్ష్మినారాయణ, షేక్ మాబుసుభాని, ఎంపీటీసీ వీరరాఘవయ్య, ఏసీడీపీవో నిర్మల, సెక్టార్ సూపర్‌వైజర్ జోజమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు టి పున్నమ్మ, బి అనురాధ, టి సుధారాణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఇంటివద్దకే రేషన్ పంపిణీ



ఒకటో వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో సరుకుల్ని పంపిణీ చేస్తున్న వార్డు కౌన్సిలర్ కొలిశెట్టి

చిలకలూరిపేట: పట్టణంలోని ఒకటవో వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా వార్డు కౌన్సిలర్ కొలిశెట్టి శ్రీనివాసరావు (గోల్డ్) పాల్గొని లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలకు అందజేశారు. సంపూర్ణ పోషణ కిట్లలో అందించే బలవర్ధక ఆహారం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదే వేదికపై తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ సుభాని(చోటు), అక్బర్, నాగరాజు, అంగన్‌వాడీ కార్యకర్త టి అరుణ, ఆయా షేక్ నన్నీబి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ టౌన్: పట్టణంలోని కొత్తపేట 1వ సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం నందు మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి 1వ వార్డు కౌన్సిలర్ వై. నాగేశ్వరి రామిరెడ్డి, 2వ వార్డు కౌన్సిలర్ నాగబ్రహ్మంలు పాల్గొని గర్భిణులకు, బాలింతలకు టేక్ హోం రేషన్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత, టీచర్లు ఉమాశంకరి, అరుణలతోపాటు తోటి సెంటర్ల టీచర్లు, మహిళా పోలీస్ రాజ్యలక్ష్మి, గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

వినుకొండ డిపోను సందర్శించిన మాచర్ల డీఎం



వినుకొండ టౌన్: ఆర్టీసీ గ్యారేజీల నిర్వహణ, బస్సుల సామర్థ్య పరిశీలన నిమిత్తం మాచర్ల డీఎం పిచ్చయ్య బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోను సందర్శించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వేరువేరు ప్రాంతాల డీఎంలు మరొక ప్రాంతంలోని డిపోలను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. తనిఖీలో భాగంగా 9 బస్సులకు ఇంధనం కారిపోతున్న సమస్యను గుర్తించామన్నారు. అంతేకాకుండా స్థానిక డీఎం కోటేశ్వరరావు నాయక్ చేతివాటం ప్రదర్శిస్తూ విధులకు హాజరు కాకుండా ఉన్న కొంత మంది సిబ్బందికి, జీతాలు చెల్లింపు చేయడం జరిగిందంటూ కొంతమంది సిబ్బంది డీఎంపై ఫిర్యాదు చేశారంటూ వచ్చిన సమాచారంలో వాస్తవం లేదన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా లోకేశ్ పాదయాత్ర ఫ్లెక్సీలు



నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై గుంతలు తీస్తున్న దృశ్యం



ప్రధాన సెంటరులో చెట్ల విరిచేసి ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు

ఇష్టానుసారంగా ఆర్అండ్‌బీ రోడ్లను తవ్వి, చెట్లను పాడుచేసిన టీడీపీ నాయకులు

వినుకొండ(నూజెండ్ల): నారా లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా వినుకొండలో నిర్వహించిన బహిరంగ సభకు టీడీపీ నాయకులు నిబంధనలు అతిక్రమించి యధేచ్ఛగా ఆర్అండ్‌బీ రోడ్లపై గోతులు తీశారు. భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేందుకు శివయ్య స్థూపం సెంటర్ నుంచి పల్నాడు రోడ్డులో ఇష్టానుసారంగా రోడ్డు మధ్యలోనే గోతులు తీసి భారీ కటౌట్‌లు ఏర్పాటు చేశారు. అలాగే శివయ్యస్థూపం సెంటర్ నుంచి పల్నాడు రోడ్డులోని షాపుల ముందు ఇరువైపులా దాదాపు 200మీటర్ల పొడవున భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న సమయంలో వ్యాపారం చేసుకునే యజమానులు వేలకువేలు అద్దెలు చెల్లిస్తున్నామని, మీరు ఇలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే మా వ్యాపారం ఏం కావాలని టీడీపీ నాయకులను ప్రశ్నించారు. అయినప్పటికీ వారి మాటలు లెక్క చేయకుండా రోడ్లకు ఇరువైపులా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతంలో దాదాపు 100కు పైగా దుకాణాలు మూతపడ్డాయి. చేసేదేమీ లేక వ్యాపారస్తులు దుకాణాలను మూసివేశారు. లోకేశ్ పాదయాత్ర వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నామని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

పచ్చని చెట్లనీ వదల్లేదు...

వినుకొండలో పచ్చని చెట్లను ఇరగదీసి పాడు చేశారు. పబ్లిసిటీ భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే క్రమంలో నిబంధనలు అతిక్రమించి బానర్లు ఏర్పాటు చేయడమే కాకుండా ఇష్టాను సారంగా రోడ్లపై గోతులు తీసి రోడ్డను కూడా పాడు చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఇటీవల వినుకొండ వచ్చినప్పుడు పచ్చని చెట్లను నరికి వేశారంటూ పచ్చమీడియాలో అసత్య ప్రచారం చేశారు. మరి ఇప్పుడు ఇలా ప్రధాన సెంటరులో రోడ్ల మధ్యలో ఉన్న చెట్లను పాడు చేయడం పై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషణ కిట్లు



శావల్యాపురంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ సంచులను అందిస్తున్న దృశ్యం



పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ



చిలకలూరిపేటలో సంపూర్ణ పోషణ కిట్లతో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

ఈపూరు: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని మహిళలు సద్వినియోగించుకోవాలని కొచ్చెర్ల గ్రామ సర్పంచ్ కోపెల దేవరాజ్ అన్నారు. మండలంలోని కొచ్చెర్ల ఎస్సీ కాలనీలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా మహిళలకు, గర్భిణులకు, బాలింతలకు, పౌష్టికాహారం అందజేశారు. హోంరేషన్ కిట్ల ను అందజేశారు. కార్యక్రమంలో సూపర్ వైజరు కె.రాజ్యలక్ష్మి, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి బుజ్జి, అంగన్‌వాడీ టీచరు రామలక్ష్మి పలువురు పాల్గొన్నారు

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలో అన్ని గ్రామసచివాలయాలు, అంగన్వాడీ కేంద్రాలలో బుధవారం గర్భిణులకు, బాలింతలకు టి.హెచ్.ఆర్ పోషకాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కార్యక్రమం లాంఛనంగా ప్రారంభించిన అనంతరం మండలంలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. మండలంలో అలవాల గ్రామ సచివాలయంలో ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ, గోగులపాడు గ్రామ సచివాలయంలో సర్పంచ్ ముండ్రు హరినారాయణ, పదార్థాలు పంపిణీ చేశారు.

చిలకలూరిపేట...

చిలకలూరిపేట: గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ వరం వంటిదని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, కమిషనర్ సీహెచ్ గోవిందరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల: తల్లీ బిడ్డల సంక్షేమం కోసం ప్రభుత్వం నేటి నుండి ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తున్నట్లు ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. నాదెండ్ల 6వ అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ, టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, సీడీపీవో శాంతకుమారి హాజరయ్యారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులు, బాలింతలు,చిన్నారులకు ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. బుధవారం స్థానిక అంగన్‌వాడి సెంటరు లో సదస్సు నిర్వహించారు.

తల్లిపాల వారోత్సవాలు

వినుకొండ(నూజెండ్ల): తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వినుకొండ రూరల్ మండలం నరగాయపాలెం సెక్టారులోని నాగిరెడ్డిపల్లి ఎస్సీ అంగన్‌వాడీ సెంటర్ నందు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మరియకుమారి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించడం ద్వారా బిడ్డకు ఆరోగ్యం , రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు.

వైఎస్సార్ సీపీలో బీసీలకు సమన్యాయం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక



ఎమ్మెల్యేతో తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

బొల్లాపల్లి: బీసీలకు అత్యంత ప్రాధాన్యత కల్పించి పదవుల్లో హోదాను ఇచ్చిన పార్టీ వైఎస్సార్ సీపీ అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని కనుమలచెరువులో తెలుగుదేశం పార్టీని వీడి 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. బుధవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. తెలుగుదేశం వీడి పార్టీలో చేరిన వారిలో జెట్టి వెంకటయ్య, జి. శ్రీను, జి.చినపోలయ్య, పెదపోలయ్య, పెదసుబ్బయ్య, రాజయ్య, తాళ్లూరి శ్రీను, గుమ్మా వెంకటేష్, జి. మల్లికార్జున, ఆర్. మల్లికార్జున, కె. గాలెయ్య, బాణావత్ కోటేశ్వరరావునాయక్‌తో పాటు మరో 18 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడిని వైఎస్సార్ సీపీలోకి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ ప్రథమం నుంచి అంటిపెట్టుకొని ఉన్న తమకు పార్టీలో న్యాయం లేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో సామాజిక న్యాయంతో పాటు సంక్షేమం, అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కుటుంబసభ్యులుగా అందరికి సమన్యాయంతో పాటు గౌరవం దక్కుతుందని, పార్టీలో ప్రతిఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమం, అభివృద్ధి రాష్ట్రంలో వర్థిల్లుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బి.శ్రీనునాయక్, వస్తం నాయక్, హనుమానాయక్, చుండూరి వెంకటేశ్వర్లు, బత్తుల చిన్నబ్బాయి యాదవ్, జయరామిరెడ్డి, డి.గోవిందు నాయక్, ఆర్.కృష్ణానాయక్, బత్తి గురవయ్య, మట్టి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.